# అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

## - నారాయణఖేడ్ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి

మనూరు, అక్టోబర్ 19: శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా మరోసారి గెలిపించాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కమలాపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధిని చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. నేడు పలు గ్రామాలకు రోడ్లు, పంచాయతీ భవనాలు, తండాల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు నిర్మించి గ్రామాలు అభివృద్ధి చేసి చూపించామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా ప్రతీ గడపకూ అందుతున్నాయన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలకు మాత్రమే సంక్షేమ పథకాలు అందేవన్నారు. రాష్ట్రంలో రైతు బాగుపడితే అంతా అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ రైతుబంధు పథకం ప్రవేశ పెట్టి దళారులకు తావులేకుండా రైతుల ఖాతాలోనే డబ్బు జమయ్యేలా చూశారన్నారు. రైతుబీమా రైతులకు ఎంతగానో ధీమా అందిస్తున్నదన్నారు. మహిళా సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి దేశంలో ఆదర్శంగా నిలిచారన్నారు. నేడు తండాలు, గ్రామాలు అని తేడాలు లేకుండా ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దే నన్నారు. గ్రామస్తులు భారీ ఊరేగింపుతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికి హనుమాన్ ఆలయం లో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు విఠల్‌రావు, గ్రామ సర్పంచ్ మస్నాజీరావు, నాయకులు మోహన్‌రెడ్డి, నాగేందర్‌రావు, సంజీవ్ రావు, అమృత్‌రావు, బాలజీ పాల్గొన్నారు.


హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి


దుర్గామాతల వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న పద్మాదేవేందర్‌రెడ్డి

# బీఆర్ఎస్‌కు హ్యాట్రిక్ ఖాయం

## - ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

రామాయంపేట, అక్టోబర్ 19: ఈ ఎలక్షన్‌లో బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయాన్ని సాధిస్తుంది.. మీ వెంటే నేనుంటా.. ఈ పద్మక్కను ఆశీర్వదించండి.. అని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం రామాయంపేటకు విచ్చేసిన ఆమె పట్టణంలోని దుర్గామాత విగ్రహాలను సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే మాట్లాడుతూ మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. ప్రతిపక్షాల మాటలు విని మోసపోవద్దని, మోసపోతే గోసపడ్తామన్నారు. సీఎం కేసీఆర్‌నే గెలిపించుకుందామన్నారు. ఎప్పుడో దశాబ్దం క్రితం నుంచి కనబడకుండా పోయిన వ్యక్తులు ఇప్పుడు ఎన్నికలు వచ్చాయని.. నేనున్నానంటూ కళ్లబొల్లి మాటలు చెప్పి ఓట్లు దండుకోవాలని చూస్తున్నారన్నారు. అది ఎప్పటికీ జరగదని, మెదక్‌లో పద్మక్క ఉన్నది.. ఎవరి ఆటలు నడవవు.. అభివృద్ధి అంటేనే కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, పద్మక్క అని అన్నారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి జరుగుతుందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, పుట్టి విజయలక్ష్మి, గజవాడ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# 100 శాతం ఓటింగ్ లక్ష్యంతో పనిచేయాలి

- మెదక్ జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షి షా
- ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వీవీ ప్యాట్లపై అవగాహన


ప్రతిజ్ఞ చేస్తున్న మెదక్ కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

మెదక్ రూరల్, అక్టోబర్ 19: 100 శాతం ఓటింగ్ లక్ష్యంతో అధికారులు పని చేయాలని మెదక్ జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షి షా అధికారులకు సూచించారు. గురువారం మెదక్ మండలంలోని రాజ్‌పల్లి దాయారలో ఓటరు నమోదుపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఓటేయడానికి అధికారులు చైతన్యపర్చాలన్నారు. ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, ప్రలోభాలకు లోను కాకూడదని, ఓటు బ్రహ్మాస్త్రమని తెలిపారు. ఎవరైనా ఓటు నమోదు చేసుకోకపోతే ఈ నెల 31 తేదీ వరకు అవకాశం ఉన్నదన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వీవీ ప్యాట్లపై అవగాహన కల్పించడానికి సంచార ప్రదర్శన వాహనం మెదక్ జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నదన్నారు. అనంతరం ఎస్పీ రోహిణి ప్రియదర్శిని మాట్లాడుతూ రాజకీయ పార్టీల అభ్యర్థులు, నాయకులు ఓటర్లను డబ్బు, మద్యం బహుమతుల వంటివి ఇచ్చి ప్రలోభాలకు గురి చేసే చట్టరీత్యా నేరమన్నారు. ఎన్నికల ప్రచారంలో అనుమతులు లేకుండా లౌడ్ స్పీకర్ వాడకం, ఇతర నిబ్బంధనలు ఉల్లంఘిస్తే సీ విజిల్ యాప్ ద్వారా నేరుగా ఫిర్యాదు చేయవచ్చున్నారు. కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబర్ 1950కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చునారు. సమావేశంలో పీడీ మోహ్మా ఇందిర, జిల్లా సైన్స్ అధికారి రాజారెడ్డి, ఆర్డీవో, అంబాదాస్ రాజేశ్వర్, సర్పంచ్ ప్రేమలత, వైస్ ఎంపీపీ ఆంజనేయులు, నాయకుడు ఎలక్షన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పదవుల కోసమే అసమ్మతి రాగం

గజ్వేల్, అక్టోబర్ 19 : గజ్వేల్ బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న అసమ్మతిలో ఒకరిద్దరి నాయకుల పదవుల కోసమే ఇదంతా జరుగుతుందని, తనకు గజ్వేల్‌లో జరిగిన బీఆర్ఎస్ నాయకుల అసమ్మతి వర్గానికి ఎలాంటి సంబంధం లేదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీ చైర్మన్ ఎం.లక్ష్మీకాంతరావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఆరు నెలలుగా పదవులు అనుభవించిన వారితోపాటు పదవులు రాని నాయకులు పార్టీని వీడేందుకు తొందరపడుతున్న వారికి తాను అలాంటి పనులు చేయకూడదని చెప్పానన్నారు. అసమ్మతి వర్గంలోని కొంతమంది తన పేరు ఉపయోగించుకొని సోషల్ మీడియా, పత్రికల్లో ప్రచారం చేసినప్పుడే వారిని హెచ్చరించానన్నారు. గతంతో పోల్చితే గజ్వేల్ ఎంతో అభివృద్ధి చెందిందని, అలాంటప్పుడు పార్టీ కోసం పనిచేయాలని తన వద్దకు వచ్చిన వారికి సూచించినట్లు తెలిపారు. నాపై అసత్య ప్రచారం చేయడం మంచి కాదన్నారు.

# పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికే మా మద్దతు

## - ఏకగ్రీవంగా తీర్మానించిన ఉప్పరి (సగర) సంఘం


ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ భూపాల్‌రెడ్డితో సంఘం నాయకులు

రామచంద్రాపురం, అక్టోబర్ 19: బీఆర్ఎస్ పటాన్‌చెరు అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికే తమ మద్దతు అంటూ ఉప్పరి (సగర) సంఘం ఏకగ్రీవంగా తీర్మానించింది. గురువారం ఆర్సీపురం డివిజన్‌లోని లక్ష్మీగార్డెన్స్‌లో ఎమ్మెల్యే, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డిని ఉప్పరి సంఘం నాయకులు కలిసి వారి మద్దతు తెలిపారు. అనంతరం వారు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి అన్ని వర్గాల వారు మెచ్చి బీఆర్ఎస్ పార్టీకి మద్దతు చెబుతున్నారన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో అన్నివర్గాల వారు అభివృద్ధి చెందారన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధితో గ్రామాల్లో భూముల ధరలకు రెక్కలు వచ్చి రైతులు కోటీశ్వరులు అయ్యారన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, ఆసరా, రైతుబంధు, దళిత బంధు, బీసీ, మైనార్టీ బంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్, ఉచిత తాగునీరు, నాయీ బ్రాహ్మణులు, రజకులకు ఉచిత కరెంట్ ఇలా సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో పేదలకు ఎంతో మేలు జరిగిందన్నారు. సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతున్నదన్నారు. ఉప్పరి(సగర) సంఘం తమకు మద్దతు ప్రకటించడం చాలా సంతోషంగా ఉన్నదన్నారు. అనంతరం భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నో పోరాటాల తర్వాత సాధించుకున్న రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ బంగారు తెలంగాణగా మార్చారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టి బీడు భూములను పచ్చగా మార్చిన ఘనత సీఎంకే దక్కిందన్నారు. అన్నివర్గాల వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్న సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అంజయ్య, సర్కిల్ అధ్యక్షుడు పరమేశ్, నాయకులు ఆదర్శ్‌రెడ్డి, కుమార్ గౌడ్, సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి అంజయ్య, కోశాధికారి వెంకటయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రం


సమావేశంలో పాల్గొన్న అధికారులు, తదితరులు

- గన్నీ బ్యాగుల కొరత లేకుండా చర్యలు చేపట్టాలి
- సంగారెడ్డి జిల్లాలో 208 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- జిల్లా ఎన్నికల అధికారి శరత్

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 19: సంగారెడ్డి జిల్లాలో వరి పండే ప్రతి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో వానకాలం 2023-24 ధాన్యం కొనుగోళ్లపై జిల్లా అదనపు కలెక్టర్ మాధురితో కలిసి సంబంధిత శాఖల అధికారులు, కాంట్రాక్టర్లతో సన్నాహక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు సాఫీగా జరగాలన్నారు. ఎలాంటి ఫిర్యాదులు రాకుండా కొనుగోళ్ల ప్రక్రియ జరగాలన్నారు. రైతుల నుంచి చిన్న ఫిర్యాదు అందినా చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో 208 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ధాన్యం సేకరణకు అవసరమైన గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకుని వెంట వెంటనే ధాన్యం కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు పంపించాలన్నారు. మిల్లర్లు ధాన్యం రాగానే వెంటనే దించుకోవాలని సూచించారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, సివిల్ సప్లయ్ డీఎం సుగుణాబాయి, డీసీవో వనజాత, డీఆర్డీవో శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ జేడీ నర్సింహారావు, డీసీవో ప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారులు, రవాణా కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వాహనం తనిఖీ

మనూరు, అక్టోబర్ 19: ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు గ్రామాలకు వెళ్తున్న నారాయణఖేడ్ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి వాహనాన్ని ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు. గురువారం మండలంలోని కమలాపూర్ గ్రామంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించేదుకు వెళ్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున డోవూర్ గ్రామ శివారులో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ సందర్భంలో అక్కడ నుంచి వెళ్తున్న ఎమ్మెల్యే వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు ఎమ్మెల్యే సహకరించి, వాహనాన్ని పక్కకు ఆపి తనిఖీ అయ్యేంత వరకు వేచి ఉన్నారు. తనిఖీ పూర్తయిన తర్వాత అక్కడ నుంచి ఎమ్మెల్యే ప్రచారానికి బయలుదేరారు.


డోవూర్ శివారులో ఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు